క్లుప్తంగా

కాజ్‌వే నిర్మించండి



కాజ్‌వే లేని చీటికాలువ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సిద్దేశ్వరపురం గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న చీటి కాలువకు కాజ్‌వేను లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చీటి కాలువకు కాజ్‌వే లేకపోవడంతో గ్రామంలోకి ఆటో, ద్విచక్రవాహన చోదకులు రాకపోకలు సాగించలేకున్నారు. వర్షకాలం చీటికాలువలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్తులు కాలువను దాటలేక తిప్పలు పడాల్సివస్తోంది. కాజ్‌వే నిర్మించాలని 30 ఏళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోనే నాథుడే లేరని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి కాజ్‌వే నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పగలే వెన్నెలాయే..!



పుత్తేరిలో వెలుగుతున్న వీధి లైటు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పుత్తేరి గ్రామంలో విద్యుత్ స్తంభాలకు అమర్చిన వీధి దీపాలు పట్ట పగలు కూడా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా అవుతోంది. అలాగే వీధి దీపాలు త్వరగా పాడైపోతున్నాయి. లైట్లను అర్పిటానికి స్విచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతోనే 24 గంటల పాటు వెలుగుతూనే ఉన్నాయి. పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి స్విచ్‌లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చదువుతో పేదరిక నిర్మూలన



విద్యాసామగ్రి అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: చదువుతో పేదరిక నిర్మూలన జరుగుతుందని యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని చిందేపల్లి ఎస్టీ కాలనీలో విద్యార్థులకు విద్యాసామగ్రి, నూతన దుస్తుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల అభివృద్ధి కోసం సంస్థ తరపున పలు సేవాకార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండాలన్నారు. ఎస్టీ కాలనీల్లో పిల్లలు చదువుకు దూరంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను చదివించాలని సూచించారు. యువనేస్తం అసోసియేషన్ ప్రతినిధులు వినోద్, అరుణ, మౌనిక, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా పండరీనాథస్వామి కల్యాణం



పండరి భజన శిక్షణ పొందిన కళాకారులు

సత్యవేడు: మండలంలోని అలిమేలు మంగాపురం(ఏఎంపురం)లో పండరి భజన భక్తులు పండరీనాథస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని 30 మంది మహిళలు పండిరి భజనలో 70 రోజులపాటు గురువు రవిదాసు వద్ద శిక్షణ పొందారు. గ్రామ సర్పంచ్ శిరీష, శ్రీనివాసులురెడ్డి, గ్రామపెద్ద పురుషోత్తంరెడ్డి సహకారంతో భజన శిక్షణ పూర్తి చేశారు. ఈ క్రమంలో శని, ఆదివారాలు పండరినాథస్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం అగ్నిగుండం అగ్నిగుండ ప్రవేశం చేశారు. అన్నదానం చేశారు. పిల్లలు, మహిళలు ఓర్పుతో 70రోజుల శిక్షణ పొంది, భజన నృత్యాలలో మెలుకువలు పొందారని పిచ్చాటూరు మండలం తులసీకృష్ణాపురానికి చెందిన పండరి భజన గురువు రవిదాసు తెలిపారు.

వేడుకగా వ్యాసజయంతి



వ్యాసమహర్షికి పూజలు చేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వ్యాస జయంతి ఘనంగా నిర్వహించారు. వ్యాసమహర్షికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్షులు తూకివాకం నాగరాజు మాట్లాడుతూ జగద్గురువులు, సద్గురువులు బోధించిన మార్గాలోనే పయనించాలన్నారు. తమకు విద్య నేర్పిన గురువులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో జగదీష్, కొరాడ దుర్గారావు, మునికృష్ణయాదవ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు భరోసా దక్కేనా?

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అన్నదాతలు ఏరువాకకు సమాయత్తమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల వంతున అందించే పీఎం కిసాన్ నిధులు విడుదలై నెల కావస్తోంది. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం రైతుభరోసా ఆర్థిక సాయం అందించకపోవడంతో పెట్టుబడుల కోసం కర్షకులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. వ్యవసాయ రంగంపై చంద్రబాబుకు ఎందుకీ కక్ష అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరదయ్యపాళెం మండలంలో దుక్కి దున్నుతున్న రైతు

- పెట్టుబడి సాయం కోసం అన్నదాతల ఎదురుచూపు
- ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- ఇంకా ప్రకటించని కొత్త ప్రభుత్వం
- ఇప్పటికే పీఎం కిసాన్ నిధుల జమ
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటే రైతు భరోసా

వరదయ్యపాళెం: అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సమాయత్తమయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏటా సీజన్ ప్రారంభంలోనే రైతులకు పెట్టుబడి సాయంగా వైఎస్సార్ రైతు భరోసా నగదును క్రమం తప్పకుండా అందించింది. కొత్తగా కొలువు దీరిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు ఆ దిశగా అడుగులు వేయలేదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన తొలి విడత సాయం రూ.2 వేలు రైతుల ఖాతాల్లో వేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే పెట్టుబడి సాయం ఊసేలేదు. వాస్తవానికి మే నెలలోనే రైతుభరోసా నగదు రూ.5,500 ఇవ్వాల్సి ఉండగా, ఎన్నికల కోడ్ అమలుతో అది కాస్త ఆగిపోయింది. పీఎం కిసాన్ నగదు దుక్కులు, విత్తనాలు, కూలీల ఖర్చులకు కాస్త ఉపయోగపడింది. ఎరువులు, పురుగు మందులకు రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సాయం కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు.

నాడు సాగు ఆరంభంలోనే..

పంటల సాగుకు పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగు ఆరంభంలోనే పెట్టుబడి సాయాన్ని అందిస్తూ వారికి అండగా నిలిచింది. పీఎం కిసాన్ సాయం రూ. 6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా రూ. 7,500 కలిపి ఏటా రూ.13,500 మూడు విడతలుగా రైతులకు అందేది. సత్యవేడు నియోజకవర్గంలోని వరదయ్యపాళెం, సత్యవేడు, బీఎన్‌కండ్రిగ, పిచ్చాటూరు, నాగలాపురం, కేవీబీపురం, నారాయణవనం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న 33,944 మంది రైతులకు ఏడాదికి రూ.25.77కోట్లు అందించేవారు. భూ యజమానులతో పాటు ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు దేవాదాయ, అటవీ, వక్ఫ్‌బోర్డు భూములు సాగు చేసే రైతులకు రైతు భరోసా సాయం కింద పెట్టుబడి సాయం అందేది.

రాష్ట్ర సాయం కోసం ఎదురుచూపులు

ప్రస్తుతం సత్యవేడు నియోజకవర్గంలో వరి సాగు చేసేందుకు దుక్కులు దున్నడం ప్రారంభించారు. వరి సాగుకు ఎకరాకు రూ. 15 వేల నుంచి రూ.20 వేల వరకు పెట్టుబడి అవసరం అవుతుంది. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతుభరోసా నగదు ఒకేసారి అందుతుండడంతో పెట్టుబడికి ఉపయోగపడేది. ఇప్పుడు పీఎం కిసాన్ రూ. 2 వేలు మాత్రమే అందడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం కింద రూ. 20వేలు అందజేస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 40 రోజులు గడిచినా రైతుకు పెట్టుబడి సాయంపై ఇంతవరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో సాగు ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని అన్నదాతలు వాపోతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందిన రైతుల వివరాలు

మండలం	రైతులు	కౌలు రైతులు
సత్యవేడు	3,888	37
వరదయ్యపాళెం	5,100	58
నాగలాపురం	4,334	25
నారాయణవనం	3,390	114
పిచ్చాటూరు	3,704	27
కేవీబీపురం	7,894	01
బీఎన్‌కండ్రిగ	5,332	18
మొత్తం	33,944	280

అప్పు చేసి పంట సాగు



అప్పు చేసి పంట సాగును ప్రారంభిస్తున్నాం. ఎకరా సాగుకు సుమారు రూ. 20వేలు పెట్టుబడి అవసరం. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతుభరోసా ఒకేసారి వస్తుండడంతో పెట్టుబడికి కాస్త ఊరట కలిగేది. ఇప్పుడు పీఎం కిసాన్ రూ. 2వేలు మాత్రమే అందడంతో పంట సాగుకు అప్పు చేయాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందిస్తే బాగుంటుంది.

–జిజ్జయ్య, రైతు, వరదయ్యపాళెం మండలం

ప్రభుత్వ నిర్ణయం వెల్లడించాలి



కూటమి ప్రభుత్వం ఏర్పడి 40 రోజులు పూర్తి కావస్తోంది. ప్రస్తుతం సీజన్‌కు వ్యవసాయ సాగుకు సంబంధించి పనులు ప్రారంభించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఈ పథకం గురించి విధివిధానాలను ప్రకటించకపోవడం బాధాకరం. దేశానికి వెన్నెముక అయిన రైతులకు సంబంధించి నిర్లక్ష్యం చేయడం మంచిది కాదు.

– మునస్వామి, గిరిజన రైతు, వరదయ్యపాళెం మండలం

రైతులను ప్రోత్సహించాలి



పంట సాగుకు ఎంతో అండగా నిలిచే పెట్టుబడి సాయం తక్షణమే అందజేసేలా ప్రోత్సాహం అందించాలి. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో తెలిపిన విధంగా రూ.20 వేలను తక్షణమే అందజేయాలి. లేని పక్షంలో రైతుల నుంచి తిరుగుబాటు తప్పదు. ఈ పథకం గురించి విధివిధానాలను కూడా తక్షణమే ప్రకటించాలి.

–మురళి, రైతు, వీఆర్‌కండ్రిగ

అసంపూర్తిగా సచివాలయ శానిటరీ కాంప్లెక్స్



అసంపూర్తిగా ఉన్న శానిటరీ కాంప్లెక్స్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 14 గ్రామ సచివాలయాల వద్ద రూ.42 లక్షలతో నిర్మిస్తున్న సచివాలయ శానిటరీ కాంప్లెక్స్‌లు అసంపూర్తిగా ఉన్నాయి. సచివాలయాల సిబ్బందికి, ప్రజల సౌకర్యార్థం ఒక్కో సచివాలయం వద్ద రూ. 3 లక్షలతో శానిటరీ కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నారు. అయితే వీటి నిర్మాణాలు అసంపూర్తిగా ఉండడంతో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేయాల్సిన అవసరం ఉంది.

భక్తిశ్రద్ధలతో బాలనాగాలమ్మ ఉత్సవాలు



బాలనాగాలమ్మ, చదవాలమ్మ ఊరేగింపు

సత్యవేడు: బాలానాగాలమ్మ అమ్మవారి వార్షికోత్సవాలు భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం బాలనాగాలమ్మ, గ్రామ దేవత చదవాలమ్మ(గంగమ్మ)కు విశేషాలంకరణ చేసి, గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీ మాతంగీశ్వరాలయం నుంచి పాలబిందెలతో అమ్మవార్లను ఊరేగించారు. మొక్కుబడి ఉన్న వారు వివాహం కాని వారు, సంతానలేమితో బాధపడుతున్న వారు, నిరుద్యోగ యువతీ యువకులు కంకణాలు ధరించి, పాల బిందెలు తలపై పెట్టుకుని, ఊరేగింపుగా సాగారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ



భీమ, దుర్యోధన పోరాట సన్నివేశం

శ్రీకాళహస్తి: పట్టణంలోని శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రదర్శించిన దుర్యోధన వధ నాటకం భక్తులను ఆకట్టుకుంది. ఉదయం ఆలయంలో అలుగు ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ఈఓ ఎస్‌వీఎస్‌ఎన్ మూర్తి ఆలయానికి విచ్చేసి, ధర్మరాజుల స్వామి, ద్రౌపదీదేవిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈఓగా ధర్మరాజులస్వామి ఆలయ ఉత్సవాలు నిర్వహించే అవకాశం తనకు రావడం పూర్వజన్మ సుకృతం అన్నారు. ఎంతో వైభంగా ఉత్సవాలు నిర్వహించామన్నారు.



అగ్నిగుండం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా గురుపౌర్ణమి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. మండలంలోని అన్ని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. సాయంత్రం బాబా ఉత్సవ మూర్తిని పుర వీధుల్లో ఊరేగించారు.

ఆలయాల్లో పున్నమి పూజలు

నారాయణవనం: మండలంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను, అన్నప్రసాదాలను అందుకున్నారు.

పిచ్చాటూరు మండలంలో..

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని రామగిరి గ్రామ దేవత శ్రీ అలంకార పరమేశ్వరి ఆలయంలో గురుపౌర్ణమి పూజలు ఆదివారం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. పూజలకు రామగిరికి చెందిన శివయ్యనాయుడు ఉభయకర్తగా వ్యవహరించారు. ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి పౌర్ణమి, అమావాస్య పర్వదినాల్లో అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు.

వేడుకగా గురుపౌర్ణమి

సత్యవేడు: పట్టణంలోని షిరిడీ సాయి బాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున కాగడా హారతితో వేడుకలు ప్రారంభించారు. అభిషేకం, అష్టోత్తరపూజ, శ్రీవిష్ణు పారాయణం, ధునిపూజ, సత్యసాయి వ్రతం, దత్తాభిషేకం జరిపారు. మధ్యాహ్నం 2 వేల మందికిపైగా అన్నదానం చేశారు. రాత్రి బాబా పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు.



సత్యవేడు: బాబాకు పూజలు చేస్తున్న భక్తులు



సత్యవేడు: అన్నదానం చేస్తున్న దాతలు

బాబా సేవలో నూకతోటి రాజేష్



రాజేష్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

నాగలాపురం: మండకేంద్రంలోని వీకేఎం వీధిలో ఉన్న షిరిడీ సాయి బాబాను వైఎస్సార్ సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ దర్శించుకున్నారు. సీపీ మందిరంలో ఆదివారం గురు పౌర్ణమి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులతో కలసి ఆయన బాబా మందిరానికి విచ్చేసి శ్రీ షిరిడీ సాయిబాబను దర్శించుకుని, బాబాకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మహేష్ రెడ్డి, జగదీష్ రెడ్డి, శ్యామ్, రాజ, దేశప్పన్, బాబు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలకు కట్టుబడాలి

తిరుపతి కల్చరల్ : కూటమి ప్రభుత్వం ప్రధాన మంత్రి మోదీకి మోకరిల్లకుండా రాష్ట్ర ప్రయోజనాలకు కట్టుబడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మూలం రమేష్, డి.సుబ్బారావు డిమాండ్ చేశారు. ఆదివారం యశోదనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో పార్టీ నగర కారదర్శి టి.సుబ్రమణ్యం అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంగన్‌వాడీ, ఆశ వర్కర్స్‌పై వేధింపులకు పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రతి పక్ష పార్టీ నేతలను వేధించడం, హత్యలు చేయడం, తప్పుడు కేసులు పెట్టడం విడనాడి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. వ్యవసాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లు రద్దుచేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మళ్లీ స్మార్ట్ మీటర్లు కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని వారు తప్పుపట్టారు. నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జేసీబీ, ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేసినట్లు సత్యవేడు సీఐ దివాకర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఐ ఓబయ్య తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

గరుడ వాహనంపై గోవిందుని విహారం



తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఆదివారం సాయంత్రం శ్రీగోవిందరాజస్వామి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం సర్వాంగసుందర అలంకారప్రియుడై శ్రీగోవిందరాజస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

మరువలేనిది మీ సహకారం



అదితిసింగ్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, ఉద్యోగులు

– వీడ్కోలు సమావేశంలో కార్పొరేషన్ కమిషనర్ అదితిసింగ్

తిరుపతి తుడా: తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ విధి నిర్వహణలో పురపాలక సిబ్బంది సహకారం మరువలేనిదని కమిషనర్ అదితిసింగ్ తెలిపారు. వైఎస్సార్ కడప జాయింట్ కలెక్టర్‌గా బదిలీపై వెళుతున్న సందర్భంగా ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆమెకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఉద్యోగాన్ని ఒక బాధ్యతగా భావించి, ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అధికారు లు, సిబ్బంది తనకు ఎంతో సహకరించారన్నారు. కొద్ది కాలమే తిరుపతిలో పనిచేసినా ప్రతి ఒక్కరూ మరువలేని తోడ్పాటు అందించారని వెల్లడించారు. ఉద్యోన్నతిపై వెళ్లినా, ఎక్కడ విధులు నిర్వహించినా ఇక్కడ పనిచేసిన కాలం జీవితంలో గుర్తుండిపోతుందన్నారు. అన్ని విభాగాల అధికారులు తమ స్థాయికి మించి సహకరించారని చెప్పారు. రాబోయే అధికారులకు కూడా ఇదే విధంగా సహకరించి, సంస్థ పురోభివృద్ధి కృషి చేయాలని సూచించారు. కార్పొరేషన్ సిబ్బంది మాట్లాడుతూ అందరినీ ఒక తాటిపై తీసుకువచ్చి ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు కమిషనర్ అదితిసింగ్ చేసిన కృషి గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, ఆర్ఓలు సేతుమాధవ్, కేఎల్ వర్మ, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్రెడ్డి, సెక్రటరీ రాధిక, డీసీపీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

అధికారులతో కుమ్మక్కై కల్కి ట్రస్ట్ కబ్జాలు



మాట్లాడుతున్న వెంకటసుబ్బయ్య

తిరుపతి కల్చరల్ : అటవీశాఖ అధికారులతో కుమ్మక్కై కల్కి ట్రస్ట్ వారు రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేశారని హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నార్ని వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఎన్ కండ్రిగ మండలం కల్లిపెట్టు గ్రామం వద్ద రిజర్వ్ ఫారెస్ట్‌లోని సర్వే నంబర్ 295లో 20.75 ఎకరాలను కల్కి ట్రస్ట్ ఆక్రమించుకుని అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చి వేయాలని కోరారు. అటవీశాఖ నిబంధనలను తుంగలో తొక్కి జంతువులు, పక్షులకు విఘాతం కలిగించేలా కల్కి ట్రస్ట్ వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కల్కి ట్రస్ట్ అక్రమాలకు సహకరించిన అటవీ, రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో హేతువాద సంఘ నేతలు డాక్టర్ ఏఆర్ రెడ్డి, వరదయ్యపాళెంలోని కల్కి ట్రస్ట్ బాధితులు చంద్రశేఖర్, రాజయ్య పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

నగరి: లయన్స్ క్లబ్ నిర్వాహకులు వీధి వ్యాపారులకు నీడ కోసం గొడుగులు పంపిణీ చేశారు. ఆదివారం నగరి బస్టాండ్ కూడలి వద్ద, బజారులో, ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, కొండచుట్టు మండపం వద్ద రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకునే వారికి గొడుగులు అందించారు. ఈ సందర్భంగా నగరి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు రాజరాజేశ్వరి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఆదరణ నోచుకోనివారికి, నిరాశ్రయులకు పలు సేవలు అందిస్తున్నామన్నారు.

నయనానందకరం.. నృత్యోత్సవం



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

తిరుపతి కల్చరల్ : అభినయ ఆర్ట్స్ 24వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం తిరుపతి మహతి కళాక్షేత్రంలో ప్రదర్శించిన పౌరాణిక పద్యనాటకం, సాంఘిక నాటిక, శాస్త్రీయ, జానపద నృత్యోత్సవాలు నయనందకరంగా సాగాయి. జాతీయ స్థాయి నాటక పోటీల్లో భాగంగా రెండో రోజు ఉద యం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో కళాబృందాలు పాల్గొని ప్రేక్షకులను అలరింపజేశారు. మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌కు చెందిన రసరంజని కళాకారులు సచికేత పౌరాణిక పద్యనాటకం ప్రదర్శించారు. అ నంతరం కాకినాడుకు చెందిన గరికిపాటి రాజారా వు కళానికేతన్ వారు ప్రదర్శించిన ఆకాంక్ష సాంఘిక నాటిక ఆలోచింపజేసింది. రాత్రి పాలకొల్లుకు చెందిన నటీనట సంక్షేమ సమాఖ్య వారు అనూహ్యం సాంఘిక నాటిక ప్రదర్శించి ప్రేక్షకులకు చక్కటి సందేశం అందించారు. నృత్యాలు, నాటకాలు ప్రదర్శించిన కళాబృందాలను అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపక కార్య దర్శి బీఎస్.రెడ్డి జ్ఞాపికలు, శాలువలతో సత్కరించారు.